# ఊర్మిళ

హారర్ స్టోరీ



కస్తూరి మురళీకృష్ణ

'అదిగో ఊర్మిళ' అంటూ హఠాత్తుగా లేచి కూచున్నాడు లక్ష్మణ్.
ఉలిక్కి పడ్డాను.
అప్పుడప్పుడే నిద్ర పడుతోంది. ఉలిక్కి పడి లేవటంతోటే గుండె అదురుతోంది.
'ఊర్మిళ చచ్చిపోయింది' అన్నాను లక్ష్మణ్‌వైపు చూస్తూ.
నావైపు వెర్రిగా చూశాడు.
'పక్కగదిలోంచి శబ్దం వినిపిస్తోంది. ఊర్మిళ నడుస్తున్న శబ్దం' అన్నాడు కళ్ళు పెద్దవి చేసి.
ఊర్మిళ, లక్ష్మణ్ భార్య. ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొన్నాళ్ళకి ఊర్మిళ గర్భవతి అయింది. ఆరోనెల గర్భస్రావం అయింది. అప్పటినుంచీ ఊర్మిళ ప్రవర్తన మారింది. పిచ్చిగా ప్రవర్తించటం అనుభవమయింది. చివరికి ఓ రోజు, ఆమె బాల్కనీ నుంచి క్రిందకు దూకి మరణించింది.



అప్పటినుంచీ లక్ష్మణ్ పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. రాత్రి అయిందంటే 'ఇదిగో ఊర్మిళ, అదిగో ఊర్మిళ' అంటున్నాడని వాళ్ళమ్మ చెప్పటంతో, విషయం తెలుసుకోవాలని, ఆ రాత్రి లక్ష్మణ్ వాళ్ళింట్లో పడుకున్నాను. నిద్ర పడుతుండగా లేపాడు.

'లక్ష్మణ్, ఊర్మిళ మరణించి వారం రోజులవుతోంది. పక్క గదిలో ఊర్మిళ లేదు. నీకే శబ్దాలు వినపడటం లేదు' కటువుగా అన్నాను.

'ఊర్మిళ చనిపోయిందా? మరి... అదిగో... పక్క గదిలో ఊర్మిళ పాడుతున్నది...'

పిచ్చివాడిలా అంటున్న లక్ష్మణ్‌ని చూస్తూంటే, ఎందుకో నా ఒళ్లు భయంతో జలదరించింది. రోమాలు నిక్కపొడిచాయి. అయినా, ధైర్యం కూడగట్టుకుని లేచి నిలబడ్డాను.

'చూడు లక్ష్మణ్... పక్కగదిలో ఎవరూ లేరు' అంటూ ఆ గదివైపు వెళ్ళబోయాను.

'వెళ్ళకు. గది తలుపు తెరవకు. ఊర్మిళ తలుపు చాటున ఉంది. గదిలోకి వెళ్తే చంపేస్తుంది. భయం భయంగా అన్నాడు.

'అదిగో... ఆమె ఊపిరి పీలుస్తున్న శబ్దం వినిపిస్తోంది' చెవులు రిక్కించాడు.

స్వతహాగా నేను ధైర్యస్తుడినే! కానీ అర్ధరాత్రి, వాడి ఇలాంటి ప్రవర్తన, నాలోనూ భయం కలిగిస్తోంది. ఎరక్కపోయి ఈ పిచ్చిగోలలో చిక్కుకున్నానని నన్ను నేను తిట్టుకున్నాను.

ధైర్యం చిక్కబట్టుకుని పక్కగది తలుపు తోశాను. నాకు తెలియకుండానే కాళ్ళూ, చేతులు వణుకుతున్నాయి.

గది చీకటిగా ఉంది. లైటు స్విచ్ వేసి గదంతా వెలుతురు పరుచుకునే వరకూ ఏమూలనుంచి ఏదో మీదకు దూకుతుందన్న భయంతో చచ్చాను.

గది ఖాళీగా ఉంది. ప్రశాంతంగా ఉంది. ఒక్కసారిగా నా శరీరంలోని ఉద్విగ్నత అంతా ఆవిరైపోయింది. ఎంతో రిలీఫ్‌గా అనిపించింది.

అంతలో నవ్వొచ్చింది.

ప్రపంచంలో భయాలు, దయ్యాలు ఏవీలేవు. అన్నీ మనిషి మెదడులో ఉంటాయి. వాటిని బయట ప్రపంచానికి ఆపాదించి, మనిషి, తనని తాను భయపెట్టుకుంటాడు. తన ఊహ నిజమని భయపడి ఛస్తాడు.

'లక్ష్మణ్... గదిలోకి రా. గదిలో ఏమీలేదు చూడు' గట్టిగా పిలిచాను.

భయం భయంగా గదిలోకి అడుగుపెట్టాడు లక్ష్మణ్.

ఇంత క్రితం వాడి భయం చూసి భయపడ్డాను. ఇప్పుడు వాడిమీద జాలి కలుగుతోంది.

మనిషి భ్రమలు ఎంత శక్తివంతమైనవో లక్ష్మణ్‌ని చూస్తూంటే తెలుస్తోంది.

భయం భయంగా గదంతా చూసి నిట్టూర్చాడు.

'లక్ష్మణ్... గది చూశావుగా ఎవరూ లేరు' అని ధైర్యం చెప్పబోతున్న నేను వాడివైపు చూసి ఆగిపోయాను.

వాడు నా మాటలు వినటం లేదు.

'అదిగో.. బయటనుంచి వినిపిస్తోంది శబ్దం. ఊర్మిళ బయట నిలబడింది. గోడ వెనక దాక్కుంది' అన్నాడు.

నాకు చికాకు వచ్చింది.

'నీకు గోడ బయట ఉన్నవి కూడా కనిపిస్తున్నాయా?' వ్యంగ్యంగా అడిగాను.

'ఊర్మిళ పిలుస్తున్నట్టుంది' అన్నాడు గుసగుసగా.

వాడి చెయ్యి పట్టుకుని బెడ్‌రూమ్‌లోకి లాక్కువచ్చాను. మంచంపై కూలేశాను.


'లక్ష్మణ్... నువ్వు చదువుకున్నవాడివి. తెలివైనవాడివి... నువ్వు కూడా ఇలాంటి భ్రమలకు గురయి భయపడటం ఏమిటి?' విసుగ్గా అడిగాను.

బేలగా నావైపు చూశాడు లక్ష్మణ్. 'నాకు వినిపిస్తోంది ఊర్మిళ పిలుపు. ఊర్మిళ గదిలో ఉన్నట్టు, గోడ బయట ఉన్నట్టు అనిపిస్తోంది. నేనేం చేయను?' అతడి కళ్ళల్లోంచి నీళ్లు కారసాగాయి.

నాకేమనాలో తోచలేదు.

ఇంతలో హఠాత్తుగా లేచాడు. వెర్రిగా నావైపు చూశాడు.

'అదిగో... కిటికీ తలుపులు కొడుతోంది. లోపలకు రానీయమంటోంది' అంటూ అరిచి, పిచ్చివాడిలా కిటికీ దగ్గరకు పరుగెత్తాడు. కానీ కిటికీ తలుపుల దగ్గరకు చేరి



ఆగిపోయాడు. వాటివైపు భయంగా చూస్తూ వణికిపోతున్నాడు.

నేను వాడి వెంటనే పరుగెత్తాను.

'నాకెవరి పిలుపూ వినబడటం లేదు' అని కిటికీ తలుపులు తెరవబోయాను.

'వద్దు వద్దు' నా చేతులు గట్టిగా పట్టుకున్నాడు. విడిపించుకోబోయాను. బలంగా పట్టుకున్నాడు.

'తలుపు తెరిస్తే ఊర్మిళ లోపలకు వస్తుంది. లోపలకు వస్తే నన్ను చంపేస్తుంది. తనతో తీసుకు వెళ్తుంది. నేను లేకుండా ఉండలేదు ఊర్మిళ' కళ్లు పెద్దవి చేసి చెప్పాడు.

వాడి చేతులు విదిలించుకుని, కిటికీ తలుపులు తెరిచాను.

చల్లగాలి హాయిగా లోపలకు దూకింది. శరీరాన్ని మెత్తగా స్పృశించింది.

'చూడు.. బయట ఏమీలేదు. అంతా నీ భ్రమ' అన్నాను.

కానీ వాడు నా మాటలు వినటంలేదు., చెవులు రిక్కించి ఏదో శబ్దం వింటున్నాడు.

'అదిగో... మేడమీద నడుస్తోంది. ఎవరో నడుస్తున్నట్టు అడుగుల శబ్దాలు వినిపిస్తున్నాయి' అంటూ వణికిపోవటం ఆరంభించాడు.

నాకు విసుగు వచ్చింది.

'కిటికీ తలుపులు కొట్టి మేడమీదకు పారిపోయిందా?' వ్యంగ్యంగా అడిగాను.

అంతలోనే బాధపడ్డాను. పిచ్చివాడి భయాలను హాస్యం చేయటం వల్ల లాభంలేదు. నాకు అబద్ధం, వాడికి నిజం. వాడి నిజాన్ని హేళన చేసే హక్కు నాకు లేదు.

కానీ వాడు నా మాటలు వింటున్నట్టే లేదు. దగ్గరకు వెళ్లి వాడి భుజంమీద చేయి వేసి చెప్పాను.

'లక్ష్మణ్... భయాలకు భయపడటం వల్ల లాభం లేదు. భయాలను భయపెట్టాలి. భయం నుంచి దూరంగా పారిపోవాలని ప్రయత్నించటం వల్ల భయం మరింత శక్తివంతమౌతుంది. భయాన్ని తిన్నగా ఎదుర్కోవాలి. భయం మీదకు దూకాలి. భయం బెదిరి పారిపోతుంది.



వాడు నావైపు వెర్రిగా చూశాడు. నా మాటలు అర్థమవుతున్నాయో లేదో తెలియటం లేదు. కానీ నావైపు చూసేవాడి చూపులో ఒకరకమైన తీక్షణత నన్ను జలదరింప చేసింది.

'ఏమిటలా చూస్తున్నావు?' అడిగాను.

'నన్ను చంపటానికి వచ్చావా ఊర్మిళా?' అడిగాడు.

వాడు ఎంత మామూలుగా అడిగాడంటే, ఎవరైనా వింటే, వాడు మాట్లాడేది నాతో కాదు, ఊర్మిళతో అనుకుంటారు. వాడి ఎదురుగా ఉన్నది నేను కాదు, ఊర్మిళ అనుకుంటారు.

'ఒరేయ్ లక్ష్మణ్.. నేనురా...' అన్నాను నవ్వుతూ.

వాడు నవ్వలేదు. నా చేతులను విదిలించి, రెండడుగులు వెనక్కు వేశాడు.

'ఊర్మిళా... నామీద కోపం వద్దు... నన్ను చంపకు' అంటూ పిచ్చి పట్టిన వాడిలా ఏడుపు ఆరంభించాడు.

'ఒరేయ్... నేనురా... కళ్లు తెరిచి చూడు' అడుగు ముందుకు వేశాను.

వాడు చిగురుటాకులా వణికిపోతూ గట్టిగా అరిచాడు.

'నా దగ్గరకు రావద్దు. నన్నేమీ చెయ్యొద్దు'

వాడి భయంలో నటన లేదు. నిజంగానే వణికిపోతున్నాడు.

నేను వాడి దగ్గరకు వెళ్లాను.

'నేనురా.... ఊర్మిళను కాను. ఊర్మిళ చచ్చిపోయింది' అన్నాను. వాడి భుజం మీద చెయ్యి వేశాను. ఆ తరువాత జరిగింది నేను ఊహించలేదు.

నేను వాడిని తాకగానే కెవ్వున కేక వేశాడు. నేనే దయ్యం అయినట్టు, చెయ్యిని విసిరి కొట్టాడు. తడబడుతున్న అడుగులతో గది బయటకు పరుగెత్తాడు.

'ఒరేయ్... భయం ఎందుకురా... మేలుకో... నేనురా...' అని అరుస్తూ వాడి వెంట పడ్డాను.

నేను వెంబడించటంతో వాడు మరింత బెదిరినట్టున్నాడు. ఇంకా వేగంగా పరుగెత్తటం ఆరంభించాడు. పరుగెత్తటమే కాదు, చేతికందినవన్నీ నా మీదకు విసిరేయటం మొదలుపెట్టాడు.

నాకు కోపం వచ్చింది.

ప్రతి మనిషి సహనానికీ ఓ హద్దు ఉంటుంది. ఆ హద్దు దాటిన తరువాత మనిషి విచక్షణ కోల్పోతాడు.

నాకోపం హద్దులు దాటుతోంది. అయినా, దాన్ని అదుపులో పెట్టుకోవాలని ప్రయత్నిస్తూ వాడిని వెంబడించాను.

వాడు బెడ్‌రూమ్ లోంచి హాలులోకి పరుగెత్తాడు. సోఫాలు, కుర్చీలు దూకి వాటిని అడ్డుగా పెట్టుకొని–

'రాకు. దగ్గరగా రాకు. ఊర్మిళా... నన్నొదిలెయ్' అంటూ అరుస్తున్నాడు.

వాడు, అరచి, దూరం పరుగెడుతున్నకొద్దీ వాడిని పట్టుకోవాలన్న పట్టుదల ఎక్కువయింది. ఒక్కసారి వాడిని పట్టుకుంటే వాడికి తెలివి వస్తుంది.

అందుకే, వాడిని వెంబడించాను.

పరుగెత్తుతున్నవాడు పైకి వెళ్ళే మెట్ల దగ్గరకు చేరుకున్నాడు. ఎందుకో ఆగిపోయాడు.

సోఫా మీద నుంచి దూకి, కుర్చీలు పక్కకు నెట్టి ఒక్క అంగలో వాడిని చేరుకున్నాను.

నేను దగ్గరకు చేరగానే వాడు బెదిరాడు.

అంతవరకూ ఏదో బెరుకు వాడిని మెట్లెక్కనివ్వలేదు. మెట్లను చూస్తూ భయపడ్డట్టు ఆగాడు.

కానీ, నేను దగ్గరకు చేరగానే, ఉలిక్కిపడ్డ వాడిలా కేకపెట్టాడు., ట్రాన్స్ నుంచి బయటకు వచ్చినవాడిలా ఒక్కసారిగా మెట్లపైకి దూకాడు.

'ఆగు లక్ష్మణ్' అంటూ చెయ్యి ముందుకు సాచాను. నా చెయ్యి వాడి చొక్కా అంచును తాకింది. అంచును గట్టిగా పట్టుకున్నాను.

వేగంగా పరుగు తీయబోతున్నవాడు మెట్లమీద పడ్డాడు. నేనూ పడ్డాను. వెంటనే వాడు లేచి మెట్లపైకి పరుగెత్తాడు.

లేచి వెంబడించాను. నేను వెంబడించటం చూసి వాడు వేగం పెంచాడు.

అంత ఆవేశంలోనూ నాకు ఆశ్చర్యం అనిపించింది. వాడింత వేగంగా పరుగెట్టగలడని నేను కలలో కూడా ఊహించలేదు. అయినా వాడిని వెంబడించాను.

మెట్లెక్కి బాల్కనీ చేరాడు. వాడి వెంట నేనూ చేరాను బాల్కనీలోకి.

'వద్దు... రావద్దు... ఊర్మిళా నన్నొదిలెయ్' అరిచాడు.

'లక్ష్మణ్... ఊర్మిళ లేదు. చచ్చిపోయింది మేలుకో' కళ్లు తెరిచి చూడు.. 'నేను అరిచాను.

నా మాటలు విన్నట్టు లేడు.

'ఊర్మిళా దగ్గరకు రాకు' అన్నాడు అడుగు వెనక్కు వేస్తూ.

'లక్ష్మణ్.. నేను' అంటూ ఒక్క అంగలో వాడిని చేరుకుని పట్టుకోటానికి చేయి సాచాను.

షాక్ కొట్టినవాడిలా నావైపు చూశాడు. వెర్రిగా గొంతు చించుకుని అరిచాడు. వెనక్కు తిరిగి పరుగెత్తాడు.

'ఒరేయ్... బాల్కనీలో ఉన్నాం. పరుగాపు... ప్రమాదం' అరిచాను. భయంతో నా వళ్లు వణకసాగింది. వాడలాగే పరుగెత్తితే పిట్టగోడ తగిలి పడతాడు.

వాడు గుడ్డివాడు పరుగెడుతున్నట్టు పరుగెత్తుతున్నాడు. తాను బాల్కనీలో ఉన్నానన్న స్పృహ ఉన్నట్టు లేదు వాడికి.

'వాడిని వెంబడిస్తే వాడు ముందుకు సాగుతాడు. అది ప్రమాదం కాబట్టి వెంబడించటం ఆపి క్రిందకు రమ్మని నచ్చచెప్పటమే క్షేమకరం' అనిపించింది.

అందుకే ఆగాను.

'లక్ష్మణ్... చూడు... నేను వెంబడించటం లేదు. ఆగిపోయాను' అన్నాను.

ఆగాడు. వెనక్కు తిరిగి చూశాడు.

'ఆగు. నేను నిన్నేం చేయను. ఇదిగో... వెనక్కు తిరిగిపోతున్నాను. క్రిందకు వచ్చెయ్యి' చిన్నపిల్లవాడిని బుజ్జగిస్తున్నట్టు అన్నాను.

'ఊర్మిళా... నన్నొదిలెయ్... నన్ను క్షమించెయ్' ఏడుస్తూ అన్నాడు.

'లక్ష్మణ్... ఇక్కడ ఊర్మిళ లేదు. ఇక్కడున్నది నువ్వు నేనే' అన్నాను.

ఏదో అర్థమైనట్టు చూశాడు. తెలివొచ్చినట్టుంది. తనవైపు చూసుకున్నాడు.

'ఇక్కడేం చేస్తున్నాం?' అడిగాడు.

నవ్వాను. సంతోషంతో గట్టిగా అరవాలనిపించింది. 'హమ్మయ్య' అని అడుగు ముందుకేయబోయాను.

పెద్దగా అరిచాడు. ఉలిక్కిపడ్డాను.

'రావొద్దు. ఊర్మిళా' అని అరిచాడు.

జరుగుతోందేమిటో అర్థం కాలేదు. అర్థమయ్యేసరికి లక్ష్మణ్ రైలింగ్ పట్టుకుని వేలాడుతున్నాడు.

నా కళ్ళముందే, నాకు తెలియని శక్తి ఏదో, లక్ష్మణ్‌ని లేపి, బాల్కనీ నుంచి క్రిందకు విసిరేసింది.

నమ్మశక్యం కాలేదు.

కానీ కళ్లు చూస్తున్నదాన్ని అబద్ధం అని ఎలా అనను?

పరిగెత్తాను.

'లక్ష్మణ్ నా చెయ్యి పట్టుకో' అరిచి చెయ్యి సాచాను.

నన్ను చూస్తూనే వాడు బెదిరాడు.

రెయిలింగ్‌ని వదిలేశాడు.

నేను దూకి వాడి చేతులు పట్టుకున్నాను.

నా చేతులు పట్టుకుని గాల్లో వ్రేలాడుతున్నాడు లక్ష్మణ్.

వాడిని పైకి లాగాలని ప్రయత్నించాను. కానీ, ఏదో శక్తి వాడిని క్రిందకు లాగుతోంది నాకన్నా బలంగా.

నెమ్మదిగా... నా చెయ్యి పట్టు సడలసాగింది.

వాడి చేతులు నా చేతుల్లోంచి జారసాగాయి.

నా కళ్ళముందే... నా కళ్ళముందే...

లక్ష్మణ్.. క్రిందకు జారిపోయాడు.. వాడి శరీరం నేలను తాకిన శబ్దం వినిపించింది.

ఒక్కసారిగా నాపై నుంచి ఏదో ఒత్తిడి తొలగినట్టయింది.

శరీరం తేలికయినట్టయింది.

జరుగుతున్నదేమిటో అర్థమయ్యేలోగా నా కాళ్లు గాలిలో తేలుతున్నాయి.

నా శరీరాన్ని భూమ్యాకర్షణ శక్తి బలంగా లాగుతోంది.

ఎందుకు?

లక్ష్మణ్, ఊర్మిళకు అన్యాయం చేశాడు.

మరి నేనేం చేశాను?

నన్నెందుకు క్రిందకు తోసేసింది.

క్రిందకు వేగంగా జారుతున్న నాకు పైన బాల్కనీలో ఏదో అస్పష్ట ఆకారం కదలినట్టు అనిపించింది. అది నవ్వుతున్నట్టనిపించింది.

నా శరీరం నేలను తాకేందుకు సిద్ధమౌతుంది.

నా తాకిడిని భరించేందుకు నేల సిద్ధమౌతోంది.

'నేరం చేసినవాడే కాదు... నేరాన్ని దాచినవాడూ నేరస్తుడే..' ఎవరో నా చెవుల్లో గుసగుసగా అన్నట్టనిపించింది.

నా శరీరం వేగంగా భూమిని తాకింది. ఎంత వేగంగా అంటే...ధడ్!...ధడేళ్!!

*



## త్రిష నెరవేరని కోరిక...

ఇన్ని సినిమాలు చేసి, ఇంత డబ్బు సంపాదించిన తరువాత తీరని కోరికలేం ఉంటాయి? అని ఆశ్చర్యపోకండి. అదీ త్రిష లాంటి సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌కి. కానీ...త్రిషకీ ఓ తీరని కోరిక ఉందట! పవన్ కళ్యాణ్ పక్కన నటించడం. ఇంతవరకూ ఆ అవకాశం రానందుకు త్రిష తెగ బాధపడిపోతోంది. తాను చిరంజీవి, వెంకటేష్, నాగార్జున తదితర హీరోల పక్కన సరసన నటించిందట కానీ, పవన్ పక్కన నటించడం మాత్రం కుదరలేదు అంటోంది. భవిష్యత్తులో తాను బాలీవుడ్‌లో బిజీ అయితే, ఇక టాలీవుడ్‌లో సినిమాలు సెలక్టివ్‌గా చేయాల్సి వస్తుందని చెబుతోంది. పవన్‌కల్యాణ్ తాజా చిత్రం 'కొమరం పులి'లో నటించేందుకు అవకాశం లభిస్తుందని ఆశపడినా, అది నెరవేరలేదని బాధపడుతోంది. ఇంతకీ మీకో విషయం తెలుసా? త్రిష పవన్‌కల్యాణ్‌కి వీరాభిమాని.